


## కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

చిత్తూరు టౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త:



చిత్తూరులో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు సోమవారం కేంద్ర బృంద సభ్యులు స్థలంను పరిశీలించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు జిల్లా కేంద్రం చిత్తూరులో కేంద్ర విద్యాలయంను ఏర్పాటు చేయాలని అభ్యర్థించడంతో కేంద్ర విద్యాలయ బృందం స్థలంను పరిశీలించడానికి చిత్తూరు విచ్చేసింది. ఈ మేరకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగసముద్రం వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలో వున్న స్థలం, ఆ స్థల డాక్యుమెంట్లను కేంద్రీయ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమీషనర్ మంజునాథ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ పరిశీలించింది.

## పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు 196 సమస్యలు

చిత్తూరు టౌన్, ఆగస్టు 5 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 196 అర్జీలు అందాయి. కలెక్టరేట్‌లో సోమవారం డ్వామా పిడి, ఇన్‌ఛార్జ్ డిఆర్ఓ రాజ శేఖర్, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీల ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 149 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరయ్యారు.

# మా భూములు మాకివ్వండి మహాప్రభో...

## -మంత్రికి వందలాది మంది దరఖాస్తులు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పుంగనూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త

మంత్రి రా ంప్రసాద్‌రెడ్డి సారథ్యంలో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో నియోజవర్గం నుంచి పెద్దఎత్తున పెద్దిరెడ్డి భూబాధితులు దరఖాస్తులు సమర్పించారు. మంత్రి రాక తెలియడంతో పెద్దిరెడ్డి బాధితులంతా తాము కోల్పోయిన భూముల వివరాలను చేతపట్టుకుని, తమ భూములను తమకు ఇప్పించాలని ప్రాధేయపడడం కనుపించింది. మంత్రిని కలసిన ఈడిగపల్లివద్ద షికారీ ప్రజలు తమ వ్యవసాయ పొలాలకు దారివ్వకుండా వైకాపా నాయకులు ఆక్రమణలు చేశారని ఆరోపించారు. తాము పండించిన పంటల భూములకు వెళ్ళనీయకుండా భూస్వాములు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈసందర్భగా చౌడేపల్లి, సోమల, సదుంతో పాటూ పట్టణానికి చెందిన పలువురి ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. వీటిని పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవిన్యూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. రొంపిచర్లనుంచి పుంగనూరు వరకు ఉన్న వేలాది మంది పేద ప్రజల ఆస్తులు విధ్వంసానికి గురయ్యాయన్నారు. రెవిన్యూ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయకపోతే కష్టమన్నారు. ఆన్‌లైన్‌లో జరిగిపోయిన అస్తవ్యస్థ విధానాలను సరిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రాబోయే ఐదేళ్ళు పూర్తిగా ప్రజల, పేదల ఆస్తుల పరిరక్షణకు అంకితమౌతామన్నారు. కార్యక్రమంలో దేశం ఇన్‌చార్జి చల్లాబాబు, సివిరెడ్డి, పోలీస్‌గిరి, వెంకటరమణరాజు, ఆర్వీటి బాబు, సయ్యద్‌సుహేల్‌బాషా, విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు, తెలుగుదేశం యువజన నాయకుడు సుబ్రహ్మణ్యంరాజులతో పాటూ పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## భక్తురాలి బంగారు నగలు చోరీ

### -నాలుగుగంటల్లోపే రికవరీ

### -తిరుమల 1టౌన్‌పోలీసుల స్పందన భేష్



తిరుమల, ఆగస్ట్ 5ప్రభాతవార్తప్రతినిధి:

ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన నెల్లూరుకు చెందిన భక్తురాలు చేతిలోని సంచిని తస్కరించి బంగారు నగలు చోరీచేసిన నిందితురాలిని తిరుమల 1టౌన్‌పోలీసులు కొన్నిగంటల్లోనే పట్టుకున్నారు. సుమారు 13లక్షల రూపాయలు విలువైన 230గ్రాముల బంగారు నగలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. నేరం జరిగిన వెంటనే బాధితురాలు తిరుమల 1టౌన్‌సిఐ విజయకుమార్‌ను సంప్రదించడంతో అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి చోరీకి గురైన నాలుగుగంటల వ్యవధిలోనే నగలు రాబట్టారు. నెల్లూరుకు చెందిన శివరాత్రి మల్లీశ్వరి తన భర్త నందీశ్వరుడితో కలసి సోమవారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఆమెకు చెందిన 230గ్రాముల బరువైన బంగారునగలు చేతిలో సంచిలో పెట్టుకుంది. ఉదయం 11గంటల సమయంలో ఆలయానికి ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో అక్కడే ఉన్న ఓ మహిళ మల్లీశ్వరిని పక్కకు లాగి ఆమె చేతిలోని సంచిని లాక్కుని అందులోని బంగారునగలను తస్కరించింది. నగలతో నిందితురాలు పరారైంది. బాధితురాలు వెంటనే తిరుమల 1టౌన్ సిఐ విజయకుమార్‌కు ఫిర్యాదుచేసింది. సిఐ స్వయంగా తమ సిబ్బందితో, విజిలెన్స్ సిబ్బంది సహాయంతో సిసికెమెరాలు గమనించారు. సిసికెమెరాల్లో కదలికలతో నిందితురాలు అనంతపురంకు చెందిన పాత నేరస్తురాలు జింకల లత గా గుర్తించారు. ఆమె నగలతో కర్నాటక సత్రాల వద్ద ఉండగా పట్టుకున్నారు. ఆమె నుండి 13లక్షలు రూపాయలు విలువైన బంగారునగలు రికవరీ చేసినట్లు 1టౌన్ సిఐ విజయకుమార్ తెలిపారు. పోలీసులు అప్రమత్తంగా ఉంటూ చోరీజరిగిన వెంటనే స్పందించి నగలు స్వాధీనం చేసుకోవడంతో తిరుమల ఇన్‌ఛార్జి అదనపు ఎస్పీ విమలకుమారి, డిఎస్పీ శ్రీనివాసాచారి, విఎస్ఓ నందకిశోర్ తిరుమల 1టౌన్ పోలీసులను అభినందించారు. పట్టుబడిన నిందితురాలు లతను రిమాండ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు.

## కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు చిత్తూరు కలెక్టరేట్ నుండి జిల్లా అధికారులు హాజరు

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

రాష్ట్ర రాజధాని అమరావతిలో సిఎం నారా చంద్రబాబు నాయుడు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా అధికారులు హాజరు అయ్యారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, మంత్రులు, ఇతర శాఖల ప్రభుత్వ కార్యదర్శులు, కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్ నుండి ఈ కాన్ఫరెన్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, సమగ్రశిక్ష పిఓ వెంకటరమణారెడ్డి, బిసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, జిల్లా పశుసంవర్థకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి శోభారాణి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## గురుతర బాధ్యతలు!

**టిడిపి కూటమి ప్రభుత్వంలో తొలిసారి సిఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష సమావేశానికి హాజరైన తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ లంకెల సుబ్బారాయుడు** ప్రభాతవార్త, తిరుపతి

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు శ్రీకాళహస్తి ఆధ్వర్యంలో మండలంలోని జికెపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిడిపిఓ శాంతిదుర్గ, ఎంఈవో భువనేశ్వరి, సూపర్‌వైజర్ భజావతి, అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీజ, ఎఎన్ఎం, ఆశావర్కర్లు, గర్భిణీస్త్రీలు, బాలింతలు హజరయ్యారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని కాపాడుదామని తెలిపారు. బిడ్డపుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని రెండు సంవత్సరాలు వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం గర్భిణీస్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి పసుపు, కుంకుమ అందించారు.





ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తున్న తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య




# పాండిచ్చేరి మద్యం పలమనేరులో పట్టివేత..టూరిస్టు బస్సు సీజ్


టూరిస్టు బస్సు నుండి మద్యం స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం, యాత్రికుల అవస్థలు

గంగవరం, ఆగస్టు 5, ప్రభాతవార్త :

దేవాలయాలు సందర్శనం కోసం తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి, పాండాచ్చేరి ప్రాంతాలకు టూరిస్టు బస్సును బుక్ చేసుకొన్న పర్యాటకులకు తిరుగు ప్రయాణంలో ఊహించని షాక్ ఎదురైంది. మరో గంట సేపులో తమ ఇళ్ళకు చేరుకుంటామని ఆశతో ప్రయాణిస్తున్న యాత్రికులకు గంగవరం వద్దకు రాగానే సెబ్ అధికారుల తనిఖీతో షాక్ తగిలింది. టూరిస్టు బస్సు నిర్వాహకులు టూరిస్టు బస్సులో గుట్టు చప్పుడు కాకుండా తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరి నుండి మదనపల్లెకు రహస్యంగా అక్రమ మద్యాన్ని తరలిస్తుంటే పలమనేరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యోరో పరిధిలోని సిఐ సురేష్‌రెడ్డి అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి గంగవరం వంతెన వద్ద అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిఎస్ఈఓ శ్రీధర్‌రావు ఆదేశాల మేరకు, ఏఎస్ఈఓ రవి ఆధ్వర్యంలో సిఐ సురేష్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు గవగవరం వంతెన వద్ద తమిళనాడు నుండి మదనపల్లె వైపు వెళ్తున్న శ్రీ వెంకటేశ్వర ఎజెబిజె ట్రావెల్‌కు చెందిన టూరిస్టు బస్సును తనిఖీ చేయగా బస్సు కింద బాగంలో 10 అట్ట బాక్సుల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 120 ఫుల్ బాటిళ్ళ అక్రమ మద్యంను స్వాధీనం చేసుకుని మదనపల్లె పట్టణంకు చెందిన బస్సు డ్రైవర్ కరమల రమణాచారి కుమారుడు కరమల రామాచారి(47)లను అరెస్టు చేసి టూరిస్టు బస్సును సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. టూరిస్టు బస్సును అధికారులు సీజ్ చేయడంతో బస్సులో ప్రయాణిస్తున్న యాత్రికులు, పిల్లలు, మహిళలు, వృద్దులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ దత్తత్రేయ, సిబ్బందిదేవరాజులు, క్రిషమాచారి, సత్తీష్‌బాబు, సయ్యద్‌బాషా, అల్తామస్, చక్రినాయక్, సుబ్బయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం డిఎస్పీగా పార్థసారథి బాధ్యతలు

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త



కుప్పం పోలీస్ సబ్ డివిజన్ అధికారిగా పార్థసారథి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడ క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేశారు. అదే సమయంలో నార్కోటిక్స్ శాఖలో విజయవాడ నగర కమీషనర్ సూచనల మేరకు డ్రగ్స్, గంజాయి పట్టివేతకు చేపట్టిన వంద రోజుల ప్రత్యేక కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈసందర్భంగా నూతన డిఎస్పీ పార్థసారథి మాట్లాడుతూ కుప్పం డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. నాలుగు మండలాల పరిధిలో ప్రజలు కూడా శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

## మల్లానూరు ప్రభుత్వ కళాశాల సమస్యల పరిష్కారానికి చర్యలు

**- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త

మండలంలోని మల్లానూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం తరపున స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలకు అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనపై సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లతో చర్చించి పక్కా భవనాలు నిర్మిస్తామన్నారు. అలాగే మౌలిక వసతులు సైతం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ సర్పంచులు రామచంద్ర, సంజీవి, దామోదర్, కొటాలూరు సర్పంచ్ రాజేంద్ర, వెంకటాచలపతినాయుడు, అశోక్, రాజ్‌కుమార్, అన్నాదొరై, వెంకటేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ముత్తుమారెమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం పట్టణం రామచంద్రారోడ్‌లో వెలసిన శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి త్రయాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభయ్యాయి. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో గణపతి పూజ, కలశ స్థాపన, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, శ్రీ మహాలక్ష్మి, దుర్గాలక్ష్మీ, శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేక కార్యక్రమం జరిపారు. కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ ఛైర్మన్ హర్ష ధర్మతేజ, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారి ఆలయం వద్ద అంబలిపోసే కార్యక్రమం నిర్వహిస్తారు.

## కుప్పం తహాశీల్దార్‌గా చిట్టిబాబు



కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం మండల నూతన తహాశీల్దార్‌గా చిట్టిబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలకు ముందు తహాశీల్దార్ చిట్టిబాబు అనంతపురం జిల్లాకు బదిలీ అయి ఇటీవలే మరలా జిల్లాకు రాగా ఉన్నతాధికారులు కుప్పం తహాశీల్దార్‌గా పోస్టింగ్ కేటాయించారు. అంతకుముందు చిట్టిబాబు వి.కోట తహాశీల్దార్‌గా విధులు నిర్వహించేవారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## స్మశాన వాటిక దారి పరిష్కారానికి చర్యలు - కడ పి.డి.

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి చీగలపల్లి గ్రామంలో దళిత కాలనీ స్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సోమవారం దళిత కాలనీ స్మశాన వాటికకు దారి లేదని గ్రామస్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కడ పి.డి.కి వినతిపత్రం అందించారు. స్పందించిన పి.డి. మధ్యాహ్నం వర్షం పడుతున్నా లెక్క చేయక స్మశాన వాటిక దారి సమస్య పరిష్కరించాలని గ్రామానికి చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. స్థలం సర్వే చేసి దారి వసతి కల్పించాలని సర్వేయర్‌ను ఆదేశించారు.

## అమరావతి నిర్మాణానికి మహిళా సంఘాలచే 49వేల విరాళం

కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి కమతమూరు సచివాలయంలో పరిధిలో ఉన్న మహిళా సంఘాలు రాజధాని అమరావతి నగర నిర్మాణానికి కనకదుర్గ మహిళా సమాఖ్య తరపున నలభై తొమ్మిదివేల రూపాయల విరాళాన్ని అందించారు. ఈ మేరకు చెక్కును కమీషనర్ శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, మెప్మా సిబ్బంది జగదీష్, శోభ తదితరులు పాల్గొన్నారు. కాగా మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రైవేట్ ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్త చెదారాలు, పిచ్చి మొక్కలను స్థల యజమానులు తొలగించుకోవాలని కమీషనర్ ప్రకటనలో పేర్కొన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్ విభాగంకు చెందిన బాలాజీ, పూర్ణచంద్ర, కుమార్, నరసింహమూర్తి, హరినాథ్, చలపతి, కృష్ణయ్య, శ్రీనివాసరావు, స్థానిక ఎఇ కరీముల్లా, లైన్‌మెన్ బద్రీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు ఢీకొని విద్యార్థి దుర్మరణం



పెద్దపంజాణి, ఆగస్టు 5 ప్రభాతవార్త

పలమనేరు - పుంగనూరు జాతీయ రహదారిలోని ఎస్ఎల్‌వి లేఔట్ వద్ద సోమవారం ఓ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటనలో విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈసంఘటనకు సంబంధించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలిలా.. మండలంలోని బసవరాజు కండ్రిగకు చెందిన వెంకటరమణ, వరలక్ష్మమ్మ భార్య భర్తలు. వీరికి సాయికిరణ్ (23) అనే కుమారుడు కలడు. ఇతను పలమనేరు మదర్ థెరిసా కాలేజ్‌లో ఎంసిఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ సాయికిరణ్ తమ ద్విచక్రవాహనం (ఎపి39సిఎక్స్9356)లో కళాశాలకు వెళ్లివచ్చేవాడు. సోమవారం కూడా యథావిధిగా టు వీలర్‌లో కళాశాలకు బయలుదేరాడని అయితే మార్గమధ్యంలో ఎస్ఎల్‌వి లేఔట్ సమీపంలో ఓ బస్సు ('ఎపి39యుఎఫ్5815) వేగంగా వచ్చి టువీలర్‌ను ఢీకొందన్నారు. దీంతో సాయికిరణ్ కాలు విరిగి తలకు తీ వ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం పలమనేరుకు ఆపై వేలూరు సిఎంసికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామాకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా కళాశాలకు బయలుదేరిన తమ బిడ్డ అకాల మృత్యువాత పడడంతో వెంకటరమణ, వరలక్ష్మమ్మ ఆర్తనాదాలు మిన్నంటాయి. బసవరాజు కండ్రిగ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గంగమ్మకు హుండీ ద్వారా రూ. 86.85లక్షల ఆదాయం

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 5 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ. 86,85,010లు ఆదాయంగా సమకూరినట్లు ఉప కమీషనర్, ఇఓ ఏకాంబరం తెలిపారు. ఆలయంలో 37రోజులకు గాను నిర్వహించిన హుండీ లెక్కింపులో నగదుతోపాటు 33.100గ్రాముల బంగారం, 690గ్రాముల వెండి, బంగ్లాదేశ్, అరేబియన్, యుఎస్ఏ కరెన్సీని భక్తులు అమ్మవారికి కానుకలుగా వేశారన్నారు. దేవాదాయశాఖ ఇన్స్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉచిత డిఎస్సీ కోచింగ్

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని నిరుద్యోగ నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు తిరపతి నగరంలో ఉచిత కోచింగ్, భోజనం, వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. బిఇడి, డిఇడి, టెట్ ఉత్తీర్ణత సాధించిన ఎరుకుల, సుగాలి, యనాది గిరిజన కులానికి సంబంధించిన అభ్యర్థులు ఈ కోచింగ్‌ను దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. డిగ్రీ, బిఇడి, ఇంటర్, డిఇడి, టెట్ ఉత్తీర్ణత సాధించిన మార్కుల ఆధారంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అభ్యర్థుల ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికలో మహళలకు 33.33 శాతం రిజర్వేషన్ వుంటుందని, అభ్యర్థులు తమ సర్టిఫికేట్లతో ఈ నెల 12 వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంను దరఖాస్తు అందజేయాల్సి వుంటుందన్నారు. వివరాలకు 08572-241056 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



పాలసముద్రం, ఆగస్టు 5 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో సోమవారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లి పాల సంస్కృతిని రక్షించుకుందాం-మనందరి బాధ్యతగా తీసుకుందాం అనే నినాదంతో పాలసముద్రం పిహెచ్‌సి సిహెచ్‌ఓ జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రంలో ఈ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నుండి పాలసముద్రం దళితవాడ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్న పిల్లలు, తల్లులకు తల్లిపాల విశిష్టతను తెలిసే విధంగా ర్యాలీ నిర్వహించారు. సిహెచ్‌ఓ జ్ఞానశేఖర్ మాట్లాడుతూ పుట్టిన శిశువుకు సత్వరం తల్లిపాలను పట్టించాలన్నారు. 6 నెలల వరకు పిల్లలకు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలన్నారు. ఆపై శిశువుకు అదనపు ఆహారం ఇస్తూ 2 సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌షి సూపర్‌వైజర్ మురళీకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్న పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అక్రమ వినియోగంపై విజిలెన్స్ తనిఖీలు

గుడిపాల, ఆగస్టు 5 ప్రభాతవార్త: మండలంలోని ట్రాన్స్‌కో కొత్తపల్లి సెక్షన్ పరిధిలో సోమవారం తిరుపతి ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని పాపసముద్రం, చిత్తపార, పిళ్ళారికుప్పం, రామభద్రాపురం, చీలాపల్లి, బొమ్మసముద్రం, కమ్మతిమ్మపల్లి తదితర గ్రామాల్లో ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు అక్రమ విద్యుత్ వినియోగంపై దుకాణాలు, గృహాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న గృహాలు, దుకాణాలపై 75 కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి 3.31 లక్షల రూపాయల జరిమానా విధించారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 5 సమస్యలు

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం 5 సమస్యలు అందాయి. అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు ఈ కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సత్వరం చర్యలు చేపట్టి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందే అర్జీలను అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అధికారులతో ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్పందనకు 39 ఫిర్యాదులు

చిత్తూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమానికి ఈ వారం జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి 39 సమస్యలు పోలీసు అధికారులకు అందాయి. పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూతగాదాలకు సంబంధించి 16, ఆర్థిక తగాదాలు 8, కుటుంబ తగాదాలు 5, వేధింపులు 3, ఆస్తి తగాదాలు 5 తదితరాలు వున్నాయి.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పాతిక అర్జీలు

కుప్పంరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం మండల కార్యాలయంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలు 25మంది వివిధ రకాల సమస్యలపై పి.డి.కి వినతిపత్రాలు అందించారు. వీటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి ఇరవై వినతులు అందాయి. అనంతరం పి.డి. అధికారులతో మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులపై ఆయా శాఖలు సత్వరమే స్పందించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాధాన్యతపై మహిళలకు అవగాహన

కుప్పంరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

పిల్లలకు తల్లిపాలు ఎంతో ముఖ్యమని వైద్యాధికారులు దీప్‌కుమార్, సుభాష్‌రాజా, జస్వంత్, కిషోర్ పేర్కొన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధి వడ్డిపల్లి గ్రామంలో కుప్పం నర్సింగ్ కాలేజ్ అధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముర్రుపాలుపట్టడం, చిన్న పిల్లలకు టీకాలు వేయించే పద్ధతులపై మహిళలకు వివరించారు. తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెస్కోలో ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారుల విచారణ

కుప్పంరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త

కుప్పం రెస్కో కార్యాలయంలో సోమవారం ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. సిఐ సుబ్రమణ్యం నేతృత్వంలో ఎస్సైలు వెంకటచిన్నా, ధరణీధర్, మరికొందరు సిబ్బంది పలు రికార్డులు పరిశీలించారు. అవసరమైన వివరాలు రెస్కో అధికారులనుంచి సేకరించారు. గత నెల 15న తొలిసారి విజిలెన్స్ అధికారులు రెస్కోలో విచారణ జరిపి పలు రికార్డులు తమ వెంట తీసుకెళ్లారు. సోమవారం మరలా రెండోసారి విచారణకు వచ్చారు.

## వాచ్‌మెన్ డ్యూటీలనుంచి విఆర్ఎలను మినహాయించాలి

వి.కోట, ఆగస్టు 5 ప్రభాతవార్త

గ్రామ రెవెన్యూ సహాయకుల జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా వాచ్‌మెన్ డ్యూటీ విధులను విఆర్ఎలు చేయాలని వచ్చిన ఆదేశాలు రద్దు చేయాలని విఆర్ఎలు సోమవారం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తాము నెలకు 11వేల వేతనంతో పనిచేస్తున్నామని తమకు అదనంగా అప్పగించిన వాచ్‌మెన్ విధులు తొలగించాలని అలాగే అర్హత కలిగిన పోస్టుల్లో విఆర్ఎలను నియమించాలని పేర్కొన్నారు. తెలంగాణాలో ఇస్తున్న రీతిలో పేస్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు సోమశేఖర్, అశోక్‌కుమార్, మునికుమార్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

**గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు**

## ఉపాధి హామీ పథకం పనులు పర్యవేక్షణ



పెళ్లకూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త

పెళ్లకూరు మండలం చావాలి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులను ఎంపిడిఓ పిఎం అన్నపూర్ణరావు, ఇఇ పి.భాస్కర్ సోమవారం పర్యవేక్షించారు. పనులకు సంబంధించి ఆయన సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

## నవజీవన్ ఆర్గనైజేషన్ వారిచే ఉచిత హెచ్‌ఐవి పరీక్షలు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త



నవజీవన్ ఆర్గనైజేషన్, పిసిపియు ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో కెవైఎస్ క్యాంపెయినర్స్ పేరుతో సోమవారం ఉచిత హెచ్ఐటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజీ మాట్లాడుతూ ప్రజలకు వారి హెచ్ఐవి స్థితి తెలియజేసి చైతన్యపరచడంలో భాగంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యు కె.మంజుల, ఎఎన్ఎం జి.హరిత, పిఇలు మారియమ్మ, శిరీషలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల పనితీరు మెరుగుపరుచుకోండి

నెలవల విజయశ్రీ

తడ, ఆగస్టు 5 ప్రభాతవార్త



తడ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనితీరు మెరుగుపరుచుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని చేనిగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ పలు సమస్యలు ఆమె దృష్టికి వచ్చాయి. పిల్లల నమోదు ఎక్కువగా చూపించినట్లు గుర్తించారు. అంగన్‌వాడీ భవనం పెచ్చులూడి పడిపోతున్నట్లు గమనించారు. అందుకు సంబంధిత అధికారులకు ఎందుకు చెప్పలేదంటూ అంగన్‌వాడీ కార్యకర్తను ఎమ్మెల్యే ప్రశ్నించారు. చిన్నపిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలో అడుకుంటుంటే వారితో మాట్లాడి నవ్వించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కూడా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విజయశ్రీ వెంట ఎంపిడిఓ విజయకుమార్, మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, పులికాట్ జాలర్ల సంఘం నాయకులు బొమ్మన్ పళణి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఐటిఐ కాలేజిలో...**

తడ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కాలేజిని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో, సిబ్బందితో మాట్లాడారు. ఇక్కడ కళాశాలలో ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

## నేటి నుంచి ఉపాధిహామీ పనుల తనిఖీ..

దక్కిలి, ఆగష్టు, 5, ప్రభాతవార్తః

మండలంలో గతేడాది జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు మంగళవారం నుంచి తనిఖీ చేస్తున్నట్లు ఉపాధిహామీ డీఆర్పీ శంకర్ తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ పనులకు సంబంధించి తనిఖీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు రికార్డులను డీఆర్పీలు ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి తతీసుకున్నారు. మంగళవారం నుంచి డీఆర్పీలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పలు రకాలకు సంబంధించిన ఉపాధి పనులను తనిఖీ చేపట్టడం జరుగుతుంది. ఈతనిఖీ కార్యక్రమం వారం రోజులు పాటు ఎనిర్వహించనున్నారు.

## స్మశాన వాటికకు స్థలం కేటాయించండి

**సిపిఐ పట్టణ కార్యదర్శి కాలేషా**

గూడూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని ఇందిరా నగర్, గాంధీ నగర్, ప్రాంతాల్లోని ముస్లీంలకు స్మశాన వాటికకు స్థలం కేటాయించండని సిపిఐ పట్టణ కార్యదర్శి కాలేషా కోరారు. స్థానిక ముస్లింలతో కలిసి సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డివో కిరణ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలేషా మాట్లాడుతూ గూడూరు రెండవ పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, గాంధీ నగర్, జగనన్న కాలనీ, టిడ్కో గృహ సముదాయల్లో సుమారు 500 మంది ముస్లీం కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేసుకొనేందుకు సుమారు 4 కిలో మీటర్లు పరిధిలో గల కోర్టు సెంటర్ వద్ద ఉన్న స్మశాన వాటికకు తీసుకువెళ్లాల్సి వస్తుందన్నారు. తమరు పరిశీలించి ఇందిరమ్మ కాలనీ ఐదు వీధిలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక ఎకరా స్థలం స్మశాన వాటికకు కేటాయించాలని కోరారు. ఈయన వెంట స్థానిక ముస్లింలు సుభాన్, నజీర్, జీలాని తదితరులు పేర్కొన్నారు.

## చిట్టమూరు తహాశీల్దార్‌గా ప్రసాద్ బాధ్యతలు

చిట్టమూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త



చిట్టమూరు మండల తహాశీల్దార్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చిట్టమూరు తహాశీల్దార్‌గా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన శర్మ బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ముందుంటానని తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు ఎప్పుడైనా తమకు తెలియజేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

## నియోజకవర్గ అభివృద్ధికి రూ.12 కోట్లు విడుదల

**- మాజీ ఎంపీ, టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం**

నాయుడుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని మాజీ ఎంపి, తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. 2014-19 సమయంలో నారా చంద్రబాబునాయుడు 24 వేల కిలోమీటర్లు దాదాపు రూ.9వేల కోట్లతో సిసి రోడ్లు వేశారని, 2019-25 వరకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనీసం ఒక్క మీటరు కూడా సీసీ రోడ్డు వేయలేదని నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఒక్కొక్క మండలానికి రెండు కోట్లు చొప్పున మొత్తం 12 కోట్లు నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్స్, మౌలిక వసతులతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. మత్స్యకారులకు జీవనాధారం పులికాట్ సరస్సు పూడికతీతకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో జిల్లా కలెక్టర్ రూ.179 కోట్లు మంజూరు చేశారని, త్వరలో పులికాట్ సరస్సు పూడిక తీసే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలో శాంతియుత, అన్నదాతల ప్రభుత్వం కొనసాగుతుందని అన్నారు.

## చిన్నారిని వేధించిన యువకుడికి దేహశుద్ధి

**- అదుపులోకి తీసుకున్న పోలీసులు**

నాయుడుపేట, ఆగస్టు 5 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలో రెండో తరగతి చదువుతున్న ఓ చిన్నారిని ఓ యువకుడు వెకిలి చేష్టలతో వేధిస్తున్న సంఘటన చూసి స్థానికులు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**తహాశీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద్ రావు**

బాలాయపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త



తహాశీల్దార్‌గా కెవిఆర్‌వి ప్రసాద్ రావు బాధ్యతలు చేపట్టారు. తహాశీల్దార్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మండలంలోని భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. విఆర్‌ఓలతో సమావేశం నిర్వహించి విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## తహాశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మునిలక్ష్మి

వెంకటగిరి, ఆగస్టు 5, ప్రభాతవార్త

వెంకటగిరి తహాశీల్దార్‌గా మునిలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. మండలంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించి మండలంలోని భూ సమస్యలను తెలుసుకున్నారు. విధులను సక్రమంగా నిరసన నిర్వహించుకుంటే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. తహాశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు డిప్యూటీ తహాశీల్దారులు రాంబాబు, సిబ్బంది స్వాగతం పలికారు.

## 10న ఆదిశంకరలో జాబ్ మేళా

గూడూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త



గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 10వ తేది మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మురగదాస్ పేర్కొన్నారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకరా ఇంజనీరింగ్‌కు కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మురగదాస్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేది మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అనేక బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని దివ్యాంగులకు కూడా జాబ్ మేళాలో పాల్గొనవచ్చు అని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇమ్మానుయేల్, విజయనిర్మల పాల్గొన్నారు.

## పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

గూడూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని త్యాగరాజా వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి దాతలుగా పొత్తూరి విజయకుమారి వ్యవహరించి 5000 అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. రోహినమ్మ విచ్చేసి దివ్యాంగులకు సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ రెడ్డి, సభ్యులు స్నేహలత రెడ్డి, శశిరేఖ, లక్ష్మి, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

## భూ స్వామి చెర నుండి భూమిని ఇప్పించండి

**రాష్ట్ర వ్యవసాయ సంఘం గూడూరు నియోజకవర్గ కన్వీనర్ సివిఆర్ కుమార్**

గూడూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త



గూడూరు మండల పరిధిలోని విందురు గ్రామంలో భూ స్వామి చెర నుండి పేదల భూమిని ఇప్పించండని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంఘం గూడూరు నియోజకవర్గ కన్వీనర్ సివిఆర్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డివో కిరణ్ కుమార్‌కి విందూరుకి చెందిన రైతులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సివిఆర్ కుమార్ మాట్లాడఉతూ విందూరు గ్రామానికి చెందిన రాగమ్మకి చెందిన 3.71 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన ఓ భూస్వామి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. గత 26 సంవత్సరాలుగా వారు సాగు చేసుకుంటున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఉన్నతాధికారులు స్పందించి రికార్డులు పరిశీలించి భూ కబ్జా దారుడు నుంచి భూమిని ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశి, పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎంబేటి చంద్రయ్య, నారాయణ, అంకయ్య, వెంకటయ్య, రాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారూ.. మీరైనా న్యాయం చేయండి

తిరుపతి హెల్త్, ఆగస్టు 5 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టర్ గారూ మీరైనా స్పందించి న్యాయం చేయాలని బాధితురాలు శారద, ఆమె చెల్లెలు ధనలక్ష్మి మీడియా ఎదుట వాపోయారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు శారద, ఆమె చెల్లెలు ధనలక్ష్మి మాట్లాడుతూ తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం పలమాకులపల్లి గ్రామానికి చెందిన ఉమాశేఖర్ అనే వ్యక్తి అడవి పందులను చంపడానికి తన బంధువుల పొలంలో తన మిత్రబృందంతో కలిసి కరెంట్ తీగలను ఏర్పాటు చేశాడు. అదే గ్రామానికి చెందిన బాధితురాలు శారద అనే మహిళ గొర్రెలు ఆవులు మేపుకుంటూ ఉండేది. గత నెల ఆరవ తేది సాయంత్రం పశువులు గొర్రెల మేపుకొని తిరుగు ప్రయాణం అయింది. ఇంతలో గొర్రెలు కొన్ని తప్పిపోయాయి. ఆ గొర్రెలను వెతుక్కుంటూ బాధితురాలు శారద ఆమె కుమార్తె బయలుదేరారు. గొర్రెలను వెతుక్కుంటూ వస్తున్న సమయంలో ఉమాశేఖర్ అడవి పందులకు పెట్టిన కరెంటు తీగలకు తగులుకొని గిలగిలలాడుతూ ఉంది. అదే సమయంలో కొద్ది దూరంలో ఉన్న కుమార్తె పరుగు పరుగున వచ్చింది. తన తల్లి కరెంట్ తీగలకు తగులుకున్న విషయాన్ని తెలుసుకొని ఆమె చేతుల్లో ఉన్న టవల్ తీసుకొని వాళ్ల అమ్మ చేతికి కట్టి దూరంగా లాగింది. అప్పటికే బాధితురాలు శారదకు రెండు కాళ్ళు పూర్తిగా కాలిపోయాయి. అదే సమయంలో ఆమె కుమార్తె కాలు కూడా గాయమైంది. వెంటనే కుమార్తె 108కి ఫోన్ చేసింది. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్పృహతప్పి పడిపోయి ఉన్న తల్లి శారదను రుయా ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజుల తర్వాత మెరుగైన చికిత్స కోసం సిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఉన్న బాధితురాలు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఉమాశేఖర్ అతని మిత్ర బృందంపై కేసు పెట్టింది. పోలీసులు మాత్రం ఉమాశేఖర్ పై కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజల దృష్టికి బాధితురాలు శారద వారి కుటుంబ సభ్యులు ఆమె చెల్లెలు ధనలక్ష్మి తీసుకొని వెళ్ళిన ప్రయోజనం లేకుండా పోయింది. అంతే కాకుండా అడవి పందులను కరెంట్ తీగలు పెట్టి చంపడమే కాకుండా మనిషి మనుషుల ప్రాణాలతో చెలగాటమాడే ఉమాశేఖర్, వారి బంధువులను తనకు జరిగిన అన్యాయానికి న్యాయం చేయాలని ప్రాధేయపడ్డది. కానీ ఆమెకు న్యాయం జరగకపోగా నీ దిక్కు ఉన్న చోట చెప్పుకో అని బాధితురాలు శారదను ఆమె చెల్లెలు ధనలక్ష్మి అక్క కుమా ర్తెను వారి బంధువులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు కనిపిస్తే చంపేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో బాధితురాలు శారద దిక్కుతోచని స్థితిలో తిరుపతి ప్రెస్ క్లబ్‌ను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయం గురించి తెలియజేసింది. చికిత్సకు సుమారు 5 లక్షలు ఖర్చు అయ్యిందని ఈ స్థితిలో తన కుటుంబాన్ని కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడిందని, అంతే కాకుండా తన కుమార్తె చదువు కూడా ఆగిపోయిందని రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి తన కుటుంబాన్నిదని తన భర్త కూడా మృతి చెందాడని కన్నీరు పర్యంతమయ్యారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు స్పందించి అడవి పందిని చంపడానికి కరెంటు తీగలు పెట్టిన ఉమాశంకర్ మిత్రబృందంపై కఠినచర్యలు తీసుకోవడంతో పాటు తనకు తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్య శరణమని ఆవేదన వ్యక్తం చేసారు.



## తారకరామా స్టేడియంలో హోరాహోరీగా నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ క్రికెట్ పోటీలు



తిరుపతి విద్య, ఆగస్టు 5, ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెప్టెంబర్ 2వ తేది ఫౌండేషన్ డే పురస్కరించుకుని బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో ఎస్‌వియు తారకరామా స్టేడియంలో క్రీడ పోటీలు జరగనున్న నేపథ్యంలో వైస్ ఛాన్సలర్ అప్పారావు అలాగే రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆటలను ప్రారంభించారు. అధ్యక్షులు శ్రీధర్ గుర్రకొండ కార్యదర్శి నెల్లూరు సుబ్రమణ్యం మానసిక ఉల్లాసానికి సంవత్సరానికి ఒకసారి జరిగే ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కోటగారం మురళి, సంయుక్త కార్యదర్శి ముత్తువేలు, కోశాధికారి గురుప్రసాద్ అలాగే మీడియా కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్, కార్యవర్గ సభ్యులు, ఆటలు ఆడడానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయితే తారకరామా స్టేడియంలో జరిగిన ఏబిసిడి ఈ ఐదు టీములలో సోమవారం ఉదయం ఈసి టీముల మధ్య హోరాహోరి పోటీ నెలకొంది. ఈ టీం కెప్టెన్ టి. విజయ సారథి, సి టీం కెప్టెన్ ఇలా మధ్య రసవత్తరమైన క్రికెట్ ఆట జరిగింది. ఇందులో ఎస్‌వియు నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రంకొండ శ్రీధర్ అత్యధిక వికెట్లు తీసి ఈ టీంకు సహాయ సహకారాలు అందించారు. అలాగే మధ్యాహ్నం డి బి టీముల మధ్య హోరాహోరి ఆట మొదలైంది. ఇందులో ఈ టీం కెప్టెన్ సి. శేషాద్రి, బి టీం కెప్టెన్ హేమంత్, ఈ రెండు టీముల్లో గెలిచిన టీములు ఏ టీంతో మంగళవారం ఉదయం తలపడనున్నాయి. అలాగే రెండు టీము మధ్యాహ్నం ఏ టీంతో పోటీ పడనుంది. ఈ పోటీల్లో నేడు ఫైనల్ ఫలితాలు రానున్నాయి. టీం కన్వీనర్‌గా జె లక్ష్మినాథ్, అంపైర్లుగా దిలీప్ సుకుమారులు నిర్వహించారు. క్రీడా పోటీలను చూసేందుకు ఎస్వీయూలోని నాన్ టీచింగ్ సిబ్బంది సభ్యులు విజయసారథి, శివానంద రెడ్డి, సభ్యులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు బత్తినయ్యకు సన్మానం

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో సుమారు పది సంవత్సరాల పాటు సామాజిక సేవలందించిన యువతరం సేవా సమితి పదవ వార్షికోత్స వం సందర్భంగా సహకరించిన, ఆదరించిన ప్రముఖులను సత్కరించారు. యువతరం సేవా సమితి సారథ్యంలో సోమవారం రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, బాలాజి హోన్‌నీడ్స్ యజమాని పిళ్ళారి బత్తినయ్య అందించిన సేవలకు నిదర్శనంగా సత్కరించారు. ఈకార్యక్రమాల్లో ఎన్‌హెచ్ఐ అధికారి వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.స్వర్ణమూర్తిలు పాల్గొన్నారు.యువతరం సేవా సమితి అందించిన సేవల్ని బత్తినయ్య అబినందించారు.

## రాహుకేతుమండపాలు,కౌంటర్ల పరిశీలించిన ఇఓ



శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో భక్తుల భద్రత దృష్ట్యా శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి సూచనలతో పలు సంస్కరణలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వియస్ఎన్ మూర్తి అమలు చేస్తున్నారు. సోమవారం ఆలయంలో రాహుకాల సమయంలో అధిక రద్దీ ఏర్పడింది. దాంతో ఆయన భక్తుల నుంచి మండపాల్లో ఎవరైనా వసూళ్ళు చేస్తున్నారా? అనే అంశానికి సంబంధించి ఆకస్మికంగా తనిఖీ చేసారు.రూ.500లు,రూ.750ల పూజలను మధ్యతరగతి ప్రజలు జరిపించుకుం టారు. ఆ మండపాల్లో ఎవరైనా బలవంతంగా వసూళ్ళు చేస్తున్నారా?అనే అంశాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు.ఇక సుదర్శనానికి సంబంధించి క్యూలైన్లలో భక్తుల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. కంచుగడప వద్ద బైఠాయించి సత్వర దర్శనానికి సంబంధించి పర్యవేక్షించారు. ప్రసాదాల కౌంటర్లు, లగేజి, సెల్‌ఫోన్లు భద్రపరచు కౌంటర్ల వద్ద పరిశీలించి భక్తుల నుంచి ఆరోపణలు వస్తే క్లోజ్ చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు నిర్ణీత రేట్లనే అమలు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్ పెక్టర్లు సుదర్శనం, హరియాదవ్‌లు ఉన్నారు.

## ఏపీ అఖిలభారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా శంకర్



తిరుపతి హెల్త్, ఆగస్టు 5 ప్రభాతవార్త : ఏపీ అఖిల భారత యాదవ యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా తిరుపతికి చెందిన టిడిపి యువ నేత, ఏపీ అఖిలభారత యాదవ యువజన మహాసభ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఢిల్లీలో నేషనల్ అఖిలభారత యాదవ మహాసభ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శంకర్ యాదవ్ నియామక పత్రాన్ని ఆ సంఘం నేషనల్ అధ్యక్షులు మహేష్ యాదవ్, నేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు అన్న రామచంద్ర యాదవ్, నేషనల్ జనరల్ సెక్రటరీ నత్తు నరేంద్ర యాదవ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు లాక వెంగళరావు చేతుల మీదుగా శంకర్ యాదవ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎంతో సమ్మకంతో ఏపీ అఖిల భారత యాదవ యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు శంకర్ యాదవ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ షార్టు సర్క్యూట్... టైర్ల షాపు దగ్ధం

శ్రీకాళహస్తి,ఆగస్టు 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న టైర్ల షాపులో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి దగ్ధమైంది.ఈ షాపులో అగ్నిప్రమాదం జరగటం ఇది రెండవ సారి.వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రాజేంద్ర బతుకు జీవనానికి ఇక్కడ టైర్ల షాపు ఏర్పాటు చేసుకొని జీవనం గడుపుతున్నారు. సోమవారం మధ్యాహ్నం యథాప్రకారం రాజేంద్ర షాపు మూసి భోజనానికి వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి వచ్చింది. ఈ నేపథ్యంలో షార్టు సర్క్యూట్ జరిగినట్లు భావిస్తున్నారు. చుట్టుపక్కల దుకాణ దారులు షాపులోంచి పొగ మంటలు వస్తుండటంతో గమనించి రాజేంద్రకు సమాచారం అందించారు. ఆయన వచ్చే సరికి దుకాణం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్గిమాపక శాఖ అధికారులు హాజరై మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15లక్షల సరకులు అగ్నికి ఆహుతైనట్లు చెబుతున్నారు.దాంతో రాజేంద్ర కుప్పకూలిపోయాడు.

## తప్పిపోయిన చిన్నారి-పోలీసులకు ఫిర్యాదు



శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త : పట్టణంలోని నందిహిల్స్‌లో నివాసం ఉంటున్న కె.వెంకటేష్, కె.యామినీక్రిష్ణల కుమారుడు కుప్పాలటెన్నిస్ ప్రీతమ్(15) పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. సోమవారం యధావిధిగా పాఠశాలకు వచ్చిన చిన్నారి మధ్యాహ్నం పాఠశాల ప్రధానోపాధ్యాయులను అనుమతి అడిగి మధ్యాహ్నం నుంచి ఇంటికి వెళ్తానని చెప్పడంతో పాఠశాల నుంచి వెళ్ళాడు. అయితే ఎంతకీ రాకపోవడంతో బంధువులు, కుటుంబసభ్యుల ఇండ్లకు వెళ్ళి వెదికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదుచేశారు.

## విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికేట్స్ ప్రదానం

తిరుపతిరూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధించాలని బిజెపి సీనియర్ నేత జి.భానుప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం యూత్ హాస్టల్లో సర్టిఫికేట్స్ ప్రదానం చేసారు. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో తిరుపతిరూరల్, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపూరం మండలాలకు చెందిన దాదాపు 1000మంది మహిళలకు గాంధీపురం గ్రామ పంచాయతీలో విశ్వకర్మ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా రోజుకు రూ.500 రుపాయాలను స్టై ఫండ్‌తో పాటు ధ్రువ పత్రాలను శ్రీ టెక్నాలజీ ఆధ్వర్యంలో అందజేయడం జరిగిందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు నేషనల్ లైస్ బ్యాంకు ద్వారా రూ.50వేల నుండి 2లక్షల రుపాయాల వరకు ఋణ సదుపాయం కలదని తెలిపారు. ఆ ఋణంతో పాటు రూ.15000 రుపాయాలు విలువ కలిగిన టూల్ కిట్టును గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ప్రధానమంత్రి ద్వారా అందించబడునని తెలిపారు. ప్రధాని మోది దూరదృష్టితో మహిళలు నైపుణ్య శిక్షణతో పాటు అన్ని రంగాలలో రాణించటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర గణాంక అధికారి మాట్లాడుతూ ఎన్వైజ్ ద్వారా అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, వాటిలో అత్యధిక సంఖ్యలో మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో స్కిల్ డెవలప్మెంట్ స్కీమ్ ప్రొగామ్‌లో నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ సంస్థ అధ్యక్షుడు కంసాని జ్ఞానశేఖర్‌రెడ్డి, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ వారితో ఎన్ఎస్‌యు పరస్పర చర్చలు

తిరుపతి విద్య, ఆగస్టు 5 ప్రభాతవార్త : జాతీయ సంస్కృతం విశ్వవిద్యాలయం తిరుపతి ప్రముఖ సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ వారితో సోమవారం సంస్కృత వర్సిటీలో కాన్ఫరెన్స్ హాల్‌లో అంతకు ముందు జరిగినటువంటి చర్చలకు, తదుత్తరపర్తి చర్చలుగా సంస్కృత భాష ప్రచారం, సంస్కృత జ్ఞానాన్ని ఆధునిక టెక్నాలజీ మాధ్యమంలో ఏ విధంగా పంపించాలి అనేటువంటి అంశం పైన పరస్పర అవగాహన చర్చలు జరపడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ జయకృష్ణ, శాస్త్రవేత్తలు సుదర్శన్, లక్ష్మీ, ఆత్రేయ సత్యనారాయణ, ఫౌండేషన్ మేనేజర్ రాంబాబు, వైస్ చాన్సలర్ కృష్ణమూర్తి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్జే రమాశ్రీ, విశ్వవిద్యాలయం ఇతర అధ్యాపకులు, అధికారుల సమక్షంలో పరస్పర చర్చలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేకించి ఫౌండేషన్ వారు ఐదు అంశాలలో వైదిక కృషి విజ్ఞానం, ప్రాచీన పాకశాస్త్రం, గణితం, సంస్కృత వినోదం, ప్రశ్నశాస్త్రం, సిద్ధాంత జ్యోతిష్యం అనే విషయాలను పరిశీలించడం జరిగింది. వాటిపైన త్వరలోనే ఎంవోయూ చేసుకొని ముందుకి వెళ్ళాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. అదే విధంగా న్యాయ శాస్త్రంలో ఉన్నటువంటి క్రోడపత్ర గ్రంథాలు ఏవైతే ఉన్నాయో వాటిని ప్రాచీన విధ్వంసుల చేత రికార్డింగ్ చేసిన విషయాలకు, చక్కగా టెక్స్ట్ రాసి, రికార్డు చేసి, వాటన్నింటిని ఇంటర్నెట్‌లో అందుబాటులోకి తెచ్చి ప్రజలకు అదే విధంగా పరిశోధకులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

## మార్కెట్‌యార్డ్‌లో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణానికి చర్యలు : ఎమ్మెల్సీ



కుప్పం, ఆగస్టు 5 ప్రభాతవార్త : కుప్పం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం గతంలో చేపట్టిన కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం త ంబిగానిపల్లి వద్ద గల మార్కెట్‌యార్డును ఆయన పరిశీలించారు. 2014-19 మధ్య కాలంలో మార్కెట్‌యార్డులో చేపట్టిన కోల్డ్ స్టోరేజ్ నిర్మా ణాన్ని వైకాపా ప్రభుత్వం కనీసం ఇంచి కూడా ముందుకు తీసుకెళ్లలేదన్నారు. రైతుల ప్రయోజనార్థం అతిత్వరలోనే కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామన్నారు. అనంతరం యార్డులో ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేత కాణిపాకం వెంకటేష్, నేతలు రవి, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లె ఎస్సై వైఖరిపై తెలుగు తమ్ముళ్ళ ఆగ్రహం

**-సీఐ జోక్యంతో సమసిన వివాదం**



తవణంపల్లె, ఆగస్టు 5 ప్రభాతవార్త: అధికార టీడీపీ నాయకులు, కార్యకర్తల పట్ల స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తవణంపల్లె పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన సమాయత్తమయ్యారు. అయితే జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిత్తూరు రూరల్ ఎస్సై శ్రీనివాసులు జోక్యం చేసుకుని టీడీపీ నాయకులతో చర్చలు జరిపి సమస్యను శాంతియుతంగా పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే...గత నెల రోజుల క్రితం తవణంపల్లె ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల పట్ల అనుచితంగా వ్యవహరించడంతో పాటు కార్యకర్తల పట్ల కక్ష్యపూరిత దోరణిలో రకరకాలుగా వేదింపులకు పాల్పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈనేపథ్యంలో మండలం కేంద్రం తవణంపల్లెలో జరిగిన ఓ సంఘటనపై విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన స్థానిక టీడీపీ నాయకులను సీఎం చంద్రబాబు వచ్చినా. నారా లోకేష్ వచ్చినా మిమ్మల్ని కాపాడలేరంటూ అసందర్భంగా ఎస్సై వ్యాఖ్యలు చేస్తూ తమను బెదిరించినట్లు వారు నాయకులకు ఫిర్యాదు చేశారు. దీనితో సోమవారం ఉదయం మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు సమాయాత్తమయ్యారు.అయితే సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని నాయకులతో చర్చలు జరిపి ఎస్సైను వీఆర్‌కు పంపిస్తున్నామని, ఇకపై ఇటువంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన చేపట్టకుండా నాయకులు వెనుతిరిగారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు వెంకటేశ్ చౌదరి, కోదండయ్య, పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్, మధుకుమార్, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, నాయకులు వినాయకం, సునీల్‌చౌదరి, అమరేంద్రనాయుడు, గోపీ యాదవ్, మునిరత్నంలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి మండిపల్లికి ఘనస్వాగతం పలికిన ప్రజలు



చౌడేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి (రాముడు)కి చౌడేపల్లిలో ఘన స్వాగతం లభించింది. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డిలకు అడుగడుగునా నీరాజనాలు పలికారు. సోమల మండలం ఆవులపల్లి ప్రాజెక్టు నుంచి అడవిమార్గంలో శెట్టిపేటకు చేరుకొన్నారు. అక్కడ మోక్ష గణపతి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ స్థాయిలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌడేపల్లి పట్టణానికి రాగానే గజమాలతో వారిద్దరినీ సత్కరించి ఆహ్వానం పలికారు. బస్టాండు నందు తేదేపా జెండాను ఆవిష్కరించారు. మంత్రి మండిపల్లి పర్యటనతో స్థానిక బస్టాండు తేదేపా ఫ్లెక్సీలు, జెండాలతో పసుపుమయమయ్యింది. భారీ ఎత్తున బాణాసంచాలు, టపాకాయలు పేల్చి తమ అభిమానాన్ని చాటుకొన్నారు. ఎన్డీయే కూటమి తేదేపా నాయకులు మాదిరాజు వెంకట్రమణరాజు, మాదిరాజు ప్రదీప్‌రాజు, లక్ష్మీపతిరాజు, ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్‌రాజు(గిరి), రెడ్డిప్రసాద్, పవన్‌కుమార్, అర్జున్, హరిరాయల్, మణిరాజు, గడ్డంవారిపల్లి మాజీ సర్పంచు వెంకట్రమణ, పంజానిపల్లి బాబునాయుడు, శింగిరిగుంట జంపాల శ్రీనివాసులునాయుడు, తేదేపా, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తన పాల్గొన్నారు.

## పాపాల పెద్దిరెడ్డి! మా ఉసురే నీకు శాపం

**కడుపు మండిన పెద్దిరెడ్డి బాధితులు బ్యానర్ ఏర్పాటు**



సోమల, ఆగస్టు 5, ప్రభాతవార్త : గత ఐదు సంవత్సరాలుగా ఆవులపల్లి సీతమ్మచెరువు ఆయకట్టు దారులను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నానా కష్టాలకు గురి చేశారంటూ బాధితులు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎదుట వాపోయారు. సంవత్స రానికి మూడు పంటలు పండే భూమిని ప్రాజెక్టు పేరుతో లా కొనేందుకు ప్రయత్నించాలని వారు వాపోయారు. సోమవారం మధ్యాహ్నం రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవుల పల్లి ప్రాజెక్టును చల్లా బాబు రెడ్డితో కలిసి సందర్శించారు. రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేయడంతో వారు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కట్ట వద్ద పెద్దిరెడ్డి ఫోటోను మార్ఫింగ్ చేసి రైతులకు ఉరివేస్తున్నట్లు ఏర్పాటు చేసి బ్యానర్ వారి యొక్క ఆక్రోశాన్ని తెలియజేస్తుంది. సీతమ్మ చెరువు కట్ట తెంపి వేయడం వల్ల రైతులు పడే బాధలు ఆయనకు వివరించడంతో సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాంప్రసాద్ రెడ్డి మండల పర్యటన సందర్భంగా సూరయ్య గారి పల్లి వద్ద భారీ గజమాలతో ఆయన సత్కరించడం పలువురిని ఆకట్టుకుంది.

## తడలో 44.6 మిమీల వర్షం

**- పాములకాల్వ సమీపంలో పడిపోయిన వరిపైరు**



తడ, ఆగస్టు 5 ప్రభాతవార్త : తడలో సోమవారం ఉదయం 44.6 మిమీల వర్షపాతం నమోదయింది. ఈ మధ్య కాలంలో ఇక్కడ ఇంత భారీ వర్షం కురవడం ఇదే. ఈ వర్షం వల్ల కొన్ని గ్రామాల్లో పొలం దుక్కులు చేసుకునేందుకు అనుకూలంగా మారిందని రైతులు సంబర పడుతుంటే, మరోవైపు ఏపుగా ఎదిగిన వరిపంట వర్షం కారణంగా పడిపోయింది. ముఖ్యంగా పాముల కాల్వ సమీపంలోని వెండ్లూరుపాడు, మాంబట్టు, కాదలూరు పంచాయతీలలో వరిపంట నేలకు ఒరిగింది. మరికొన్ని రోజుల్లో కోత దశకు చేరుకుంటున్న వరిపైరుపై కూడా ఈ వర్షం ప్రభావం పడిందని, మళ్లీ వర్షం కురిస్తే పంట మొలకలెత్తి పెద్దనష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు. సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్ఎన్ కాంచన పడిపోయిన వరి పొలాలను పరిశీలించారు. ఆమె రైతులతో మాట్లాడుతు పలు సూచనలిచ్చారు. మండలంలో కాదలూరుతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలకు వర్షపునీరు చేరిందని గ్రామస్థులు తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



గూడూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త : భవన నిర్మాణ కార్మిక సంఘం గూడూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు డివిజన్‌లో ప్రజలందరికీ ఉచితంగా ఇసుకను అందించాలని కోరుతూ స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం ఆఫీసు వద్ద నుండి ర్యాలీ వివేకానంద రోడ్, ముత్యాలపేట, రైతు బజార్ మీదుగా రాజా వీధి, గాంధీ బొమ్మ, సంగం థియేటర్ హాస్పిటల్ రోడ్డు మీదుగా, ఆర్డిఓ ఆఫీస్ వరకు ర్యాలీగా, కార్మికులు ఇసుక ఉచితంగా ఇవ్వాలి, ఇసుకను అందుబాటులో ఉంచాలి, కూలీలకు పని కల్పించాలి అనే నినాదాలతో ప్రభుత్వంపై నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి. శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైఎస్ఆర్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టిందని, సంక్షేమ బోర్డుని రద్దు చేయడంతో వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని ఇసుక కోసం వేల రూపాయిలు డబ్బులు పెట్టి కొనుగోలు చేసే పరిస్థితి గత ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఇది చాలా దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 12, 14 తీసుకువచ్చి కార్మికుల కడుపు కొట్టిందని, కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్ మాట్లాడుతూ గూడూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లేక రోజువారి పని చేసుకునే కూలీలు పని లేక ఇంటికే పరిమితం అయిపోతున్నారని, అందువల్ల ఉచితంగా ఇసుకను ఏర్పాటు చేయాలని స్థానిక ఆర్డివో దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తమ చాంబర్ నుండి వెలుపల వున్న కార్మికుల దగ్గరకు ఆర్డిఓ వచ్చి కార్మికులకు బాలిరెడ్డిపాలెం సర్కిల్ నందు ఇసుక క్వారీలు సమక్షంలో హామీని ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లి న్యాయం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, నాయకులు సేలం సేకరాచారి, గండికోట మధు, ఎస్‌డి రఫి, బండి కృష్ణయ్య, ఎన్. నాగేంద్ర, ఎస్‌డి సజాద్ మేస్త్రీ, బాబు మేస్త్రీ, సాయి, సిఐటియు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, బివి రమణయ్య, పట్టణ కార్యదర్శి ఎస్. సురేష్, అడపాల ప్రసాద్, బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమాత్యుని పర్యటనలో జేబుదొంగల చేతివాటం

-చౌడేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చౌడేపల్లి పర్యటనలో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. మంత్రి మండిపల్లి తొలిసారి మండలానికి రావడంతో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పర్యటనలో పాల్గొన్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు జేబుదొంగలు చేతులకు పని చేప్పారు.మంత్రి మండిపల్లి శెట్టిపేట నుంచి చౌడేపల్లికి రావడంతో ఎన్డీయే కూటమి నాయకులు ఒక్కసారిగా గుమికూడారు. దీంతో ఎవరూ అదుపు చేయలేక పోవడంతో కాస్తంత తొక్కిసలాట చోటు చేసుకొంది. బస్టాండులో తేదేపా జెండా ఆవిష్కరణ ముగిశాక అందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. యల్లంపల్లికి చెందిన రవినాయుడు రూ. 55వేలు, ఎల్లకుంట్ల మణి రూ. 13వేలు, బోయకొండ సుబ్బు రూ. 30వేలు ఈ విధంగా రూ. లక్షల్లో చేతివాటం ప్రదర్శించారు. కాగా తేదేపా నాయకులు కొందరు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలు ఆధారంగా అనుమానితున్ని పట్టుకోగా అతను దొంగతనం గుట్టును రట్టు చేసాడు. దీంతో మరొక అనుమానితున్ని పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు బాధితులు తెలిపారు.

## వికలాంగులకు శ్రీవారి దర్శన భాగ్యం...

రేణిగుంట, ఆగస్టు 5 ప్రభాతవార్త: తమిళనాడు నుంచి శ్రీవారి దర్శనార్థం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక రైలులో చేరుకున్న వికలాంగులకు జనసేన నేతలు, మార్వాడీలు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. వీరికి స్వాగతం పలకడానికి తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోటా వినుత వచ్చారు. వీరిని మార్వాడీలు ఘనంగాసత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో వీరిని తిరుమలకు సాగనంపారు. బస్సులను తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, జనసేన ఇన్‌చార్జి కోట వినుత, జనసేన నేత కోట చంద్రబాబునాయుడు, నగరం భాస్కర్ బాబు, మార్వాడీ నేతలు ఓం ప్రకాష్ చిప్ప, నరేందర్ రాథోడ్, నరేందర్ జై, శ్యామ్ చంద్, గెహ్లాట్, ప్రకాష్ చంద్ జైన్, కిషోర్ చంద్ జైన్, నిమిచంద్ గేహ్లాట్, తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. బస్సులను పంపిన తరువాత నిమిచంద్ గెహ్లాట్ ఆధ్వర్యంలో మార్వాడీలు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సందీప్, రైల్వే డిఎస్‌పి షాను, అర్బన్‌ఎస్ఐ మల్లికార్జున్, ఐపీఎఫ్ సందీప్, అర్బన్ ఎస్ఐ అరుణకుమార్‌రెడ్డి, రైల్వే ఎస్ఐ రవిలను ఘనంగా సత్కరించారు.

## తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



తిరుపతి హెల్త్, ఆగస్టు 5 ప్రభాతవార్త : ఎస్‌వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి చిన్న పిల్లల విభాగంలో ప్రపంచ తల్లిపాల వార్షికోత్సవాల సందర్భంగా రుయా ఆసుపత్రి ప్రాంగణంలో రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు, సూపరింటెండెంట్ డాక్టర్ జి. రవి ప్రభు ఆదేశాల మేరకు, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని నినాదాలతో ర్యాలీ కార్యక్రమాన్ని డాక్టర్ జి. రవి ప్రభు మాట్లాడుతూ పుట్టిన వవెంటనే ఇచ్చే వసుపు రంగు పాలలో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడమే కాకుండా, వారి మెదడు వికసించేందుకు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్టమని, పుట్టిన గంట లోపు బిడ్డకు తల్లి మురిపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడంతో పాటు అమృతంలా పని చేస్తుంది. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, వైద్యాధికారులు, వైద్యులు, నర్సింగ్ కళాశాల సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఎంతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని తల్లిపాలు ఆవశ్యకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## శ్రీ విశ్వేశ్వర యోగా రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ నందు బిఎస్సి యోగ అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి విద్య, ఆగస్టు 5, ప్రభాతవార్త : నేపాల్, ఖాట్మండు యూనివర్సిటీ అనుబంధమైన తిరుపతిలోని శ్రీ విశ్వేశ్వర యోగా రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో బిఎస్‌సి యోగా అడ్మిషన్స్ జరుగుచున్నవని, ఈ కోర్సులో భాగంగా వైదిక శాంతి మంత్రాలు, పతంజలి యోగ సూత్రాలు, హఠయోగ శ్లోకాలు, షట్ క్రియలు, యోగాసనాలు, ప్రాణాయామములు, ముద్రలు, బంధములు, ధారణ, ధ్యానము, తదితర యోగ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంజరుగుతుందని, యోగా పరిశోధనా, యోగ థెరపీ అంశాలపై ప్రత్యేక తర్ఫీదు ఇవ్వబడును. ఆసక్తి గల విద్యార్థులు చేరవల్సిందిగా ప్రిన్సిపాల్ డా. సుమన పోతుగుంట ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 5 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు తెలియజేశారు.

## ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో తరగతులను పరిశీలించిన విసి



తిరుపతి విద్య, ఆగస్టు 5 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంచార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు సోమవారం మధ్యాహ్నం ఆర్ట్స్ బ్లాక్‌లోని తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష మొదలైన శాఖలను తనిఖీ చేశారు. విద్యార్థుల గైర్హాజరుపై ఆచార్యులను వివరణ కోరారు. క్లాసులు, విద్యార్థుల హాజరుపై విసి ఉదాసీనత వహించబోనని, విద్యార్థులను సంబంధిత సబ్జెక్టులో లోతైన అధ్యయనం చేయించి జ్ఞానం పెంపొందించే బాధ్యత అధ్యాపకులపై వుందని వారు శాఖాధ్యక్షులకు తెలియజేశారు.